క్లుప్తంగా

నేడు బాలారంలో జగనన్న సురక్ష

కొయ్యూరు: బకులూరు పంచాయతీ బాలారం సచివాలయంలో సోమవారం నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమానికి అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, పాడేరు నియోజకవర్గ పార్టీ పరిశీలకులు చొక్కాకుల వెంకట్రావు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి హాజరుకానున్నట్టు ఎంపీడీవో లాలం సీతయ్య ఆదివారం తెలిపారు. అనంతరం బూదరాళ్లలో సచివాలయ భవనాన్ని ప్రారంభించి బి.కొత్తూరు, సింగవరం, బూదరాళ్లలో ఎమ్మెల్యే గడపగడపకు కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు. దీనికి సంబంధిత అధికారులు పూర్తి వివరాలతో రావాలని ఆయన కోరారు.

ధాన్యంపాలెంలో...

అడ్డతీగల: మండలంలోని ధాన్యంపాలెంలో సోమవారం ఉదయం 9 గంటల నుంచి జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కె.బాపన్నదొర తెలిపారు. వివిధ ధ్రువపత్రాల కోసం దరఖాస్తులు చేసిన అభ్యర్థులు ఈ కార్యక్రమానికి వచ్చి మంజూరైన సర్టిఫికెట్లను పొందవచ్చన్నారు. అలాగే ఇతరత్రా సమస్యలపై జగనన్న సురక్ష కార్యక్రమంలో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

పాస్టర్ శామ్యూల్ మృతికి సంతాపం



శామ్యూల్ (ఫైల్)

అరకులోయరూరల్: మండల కేంద్రంలోని ప్రేయర్‌హౌస్ చర్చి సీనియర్ పాస్టర్ రెవరెండ్ కొర్రా శామ్యూల్(62) ఆదివారం ఉదయం మృతి చెందారు. గత కొద్ది రోజులుగా ఆయన అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందినట్టు పలువురు చెప్పారు. ఆయన మృతికి నియోజకవర్గంలోని పాస్టర్లు, క్రైస్తవులు సంతాపం తెలిపారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

అనంతగిరి: మండలంలోని కొత్తవలస గిరిజన సంక్షేమ బాలుర పాఠశాలను ఆదివారం బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా కన్వీనర్ బాకా లవకుశ సందర్శించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఆరోగ్య సూత్రాలను పాటించాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చన్నారు. డిప్యూటీ వార్డెన్ ధర్మ, ఉపాధ్యాయుడు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

బోరు పనులు ప్రారంభం



బోరు పనులను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు మత్స్యలింగం, నేతలు

హుకుంపేట: మండలంలోని దుర్గం పంచాయతీ వాకపల్లిలో జెడ్పీ నిధులు రూ.1.2లక్షల వ్యయంతో నిర్మించనున్న బోరు పనులను జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. సర్పంచ్ పాతుని రవణమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు కిల్లో మీనా, పార్టీ యువజన విభాగ జిల్లా ప్రధాన కార్యదర్శి నైని సత్తిబాబు, నాయకులు సాంబ, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ సేవలు మరింత విస్తృతం



వాకర్స్‌క్లబ్ సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు

తుమ్మపాల: పట్టణంలో వాకర్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో వివేకానంద ఫంక్షన్ హాల్లో 3వ కెబినెట్ మీటింగ్ ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వాకర్స్ 101 క్లబ్ గవర్నర్ ఉప్పలపాటి శుభ, ఏహెచ్ఎస్ వెంకటరావు, డాక్టర్ డీడీ నాయుడు ముఖ్యఅతిథులుగా పాల్గొని వాకర్స్ క్లబ్ సేవల్ని వివరించారు. రానున్న కాలంలో తమ సేవల్ని మరింత విస్తృతం చేయనున్నట్టు పేర్కొన్నారు. సమావేశంలో కల్యాణి అకాడమీ చిన్నారుల భరతనాట్య ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. అంతకుముందు గణేష్ ప్రార్థన, స్వాగత ఉపన్యాసం ప్రతిజ్ఞా కార్యక్రమాలను రాపేటి నారాయణరావు, యల్లపు సత్యనారాయణ నిర్వహించారు. కార్యక్రమంలో ఏరియా వైస్ ప్రెసిడెంట్ లక్ష్మీరెడ్డి, ఆర్‌సీ-5 డాక్టర్ విష్ణుమూర్తి, అధిక సంఖ్యలో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామీణ రహదారులకు మహర్దశ

- చెరుకుమడత- కంటిపురం రోడ్డుకు మోక్షం
- శరవేగంగా పనులు
- రూ.1.95 కోట్ల నిధులు మంజూరు
- హర్షం వ్యక్తం చేస్తున్న గిరిజనులు



తారు వేసేందుకు సిద్ధంగా ఉన్న చెరుకుమడత- కంటిపురం రోడ్డు

అనంతగిరి: ఏళ్ల తరబడి పలు గ్రామాలకు రహదారులు లేక గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సమస్య పరిష్కరించాలని గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పాలకులకు గిరిజనులు విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోయింది. వర్షం పడితే చిత్తడిగా మారే రహదారులతో నానా అవస్థలు పడ్డారు. అధ్వాన దారులతో అత్యవసర సేవలు కూడా అందక గిరిజనులు పడిన కష్టాలు వర్ణనాతీతం. కొన్ని ప్రాంతాల్లో టీడీపీ ప్రభుత్వంలో పనులు ప్రారంభించినా పూర్తి చేయకుండా అసంపూర్తిగా వదిలేశారు. ఇదంతా...గతం.. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక గిరిజన గ్రామాల రహదారులకు మోక్షం కలిగింది. గత టీడీపీ హయాంలో పాలకుల నిర్లక్ష్యం వల్ల అసంపూర్తిగా వదిలేసినా రహదారులను సైతం ప్రస్తుతం బాగు పడుతున్నాయి. ప్రతి గ్రామంలో శరవేగంగా రోడ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇందుకోసం ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేస్తుంది. శివారు ప్రాంతాలకు సైతం రవాణా మెరుగుకానుండడంతో గిరిజనుల ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

టీడీపీ హయాంలో శంకుస్థాపనలతోనే సరి

మండలంలోని పెదబిడ్డ పంచాయతీ నిమ్మలపాడు రోడ్డు జంక్షన్ నుంచి చెరుకుమడత, కంటిపురం మీదుగా పెదబిడ్డ వరకు గత 15 ఏళ్ల క్రితం తారు రోడ్డు నిర్మాణం జరిగింది. అయితే నిర్వహణ లేక పోవడంతో పాటుగా ఏటా వర్షాలకు పూర్తిగా తారు రోడ్డు కొట్టుకుపోయి అస్తవ్యస్తంగా మారింది. దీంతో పెదబిడ్డ, గుమ్మ పంచాయతీలు గిరిజనులు రాకపోకలకు నరకయాతను అనుభవించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నికల ముందు హడావుడిగా రోడ్డు పనులకు శంకుస్థాపనలు చేశారు. అయితే పనులు నిలిచిపోవడంతో గిరిజనుల కష్టాలు మళ్లీ మొదటికివచ్చాయి.

ప్రారంభమైన తారురోడ్డు పనులు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత రహదారికి మోక్షం కలిగింది. నిమ్మలపాడు రోడ్డు జంక్షన్ నుంచి చెరుకుమడత మీదుగా కంటిపురం వరకు సుమారు 2.4 కిలో మీటర్లకు గాను, జాతీయ ఉపాధిహామీ పథకంలో సుమారు 1.95కోట్లు మంజూరైంది. ప్రస్తుతం తారురోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. దీంతో గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

త్వరలో పనులు పూర్తి

నిమ్మలపాడు జంక్షన్ నుంచి చెరుకుమడ మీదుగా కంటిపురం వరకు తారురోడ్డు పనులు జరుగుతున్నాయి. రెండు వారాల్లో పనులు పూర్తి చేసే విధంగా కృషి చేస్తున్నాం. నాణ్యత ప్రమాణాలతో రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నాం.

– గణేష్, ఏఈ ట్రైబల్ వెల్ఫేర్, అనంతగిరి

పనులు పూర్తయ్యేదెన్నడో?

- శిథిలావస్థలో అంగన్‌వాడీ భవనం
- చిన్నారుల ఇబ్బందులు



బొడ్డచెట్టులో ప్రారంభానికి నోచుకోని అంగన్‌వాడీ కేంద్రం

అనంతగిరి: మండల కేంద్రంలోని బొడ్డచెట్టు కాలనీలో ఉన్న అంగన్‌వాడీ-1 కేంద్రం భవనం నిర్మించిన, నాలుగేళ్ల గడుస్తున్నప్పటికీ ప్రారంభానికి నోచుకోకపోవడంతో చిన్నారులు, బాలింతలు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. టీడీపీ హయాంలో పనులు ప్రారంభమైనా బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్ భవనం పనులు అసంపూర్తిగా వదిలేశారు. అప్పటి నుంచి అంగన్‌వాడీ భవనం అసంపూర్తిగా దర్శనమిస్తోంది. ప్రస్తుతం అద్దె ఇంట్లో కేంద్రాన్ని కొనసాగిస్తున్నారు. దీంతో చిన్నారులు, గృహిణులు, బాలింతలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి భవనం పనులు పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని, సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

సత్యసాయి సేవా మార్గం అనుసరణీయం

- సత్యసాయి సంస్థల జిల్లా అధ్యక్షుడు వైశ్యరాజు కృష్ణంరాజు



సత్యసాయి భక్తులకు పుస్తకాలను అందించిన వైశ్యరాజు

కె.కోటపాడు: సత్యసాయి చూపిన సేవా మార్గం అనుసరణీయమని సత్యసాయి సంస్థల జిల్లా అధ్యక్షుడు వైశ్యరాజు కృష్ణంరాజు తెలిపారు. ఆదివారం కింతాడలోని రామసత్యసాయి మందిరంలో సత్యసాయి భక్తులు ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తి మార్గాన పయనించి పది మందికి ఒక్కొక్కరూ సహాయ కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు. అనంతరం భక్తులకు సాయి లిఖిత నామ జపం పుస్తకాలను పంపిణీ చేశారు. సత్యసాయి భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి బొత్సకు జన్మదిన శుభాకాంక్షలు



మంత్రి బొత్స సత్యనారాయణకు శుభాకాంక్షలు తెలుపుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి అమర్‌నాథ్, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తదితరులు

సాక్షి,పాడేరు: రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణను జిల్లా ఇన్‌చార్జి మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌తో కలిసి అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తదితరులు విజయనగరంలో ఆదివారం కలిశారు. బొత్స సత్యనారాయణ జన్మదిన వేడుకను పురస్కరించుకొని ఆయన పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి వై.వి.సుబ్బారెడ్డిని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, నేతలు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. నియోజకవర్గంలోని పార్టీ కార్యక్రమాలను ఎమ్మెల్యే వివరించారు.వైఎస్సార్‌సీపీ యువజన విభాగ రాష్ట్ర కార్యదర్శి చెట్టి వినయ్, పెదబయలు జడ్పీటీసీ కూడా బొంజుబాబు, ఉమామహేష్ తదితరులున్నారు.

16న మోదకొండమ్మ పండగ

మాడుగుల రూరల్: కె.జె.పురం గ్రామ ముఖ్య ఆరాధ్య దైవం, మన్యం దేవత మోదకొండమ్మ పండగ ఈ నెల 16న ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం రాత్రి అమ్మవారి ఘటాలు ఊరేగింపు ప్రారంభమైంది. ఇప్పటికే ఆలయాన్ని రంగులతో తీర్చిదిద్దారు. పలు చోట్ల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

గౌతమ పఠన మందిరానికి మైక్‌సెట్ వితరణ



మైక్ సెట్ అందజేస్తున్న పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ రామ్మోహనరావు

మునగపాక: స్థానిక సంతబయిల గౌతమపఠన మందిరానికి పీఏసీఎస్ పర్సన్‌ఇన్‌చార్జి కోనపల్లి రామ్మోహనరావు ద్వారా ఆదివారం మైక్‌సెట్‌ను దాతలు అందజేశారు. ఈ సందర్భంగా గౌతమపఠన మందిరం అధ్యక్షుడు దాడి సూరిబాబు మాట్లాడుతూ గ్రామస్తుల సహకారంతో పఠనమందిరాన్ని మరింత అభివృద్ధి చేయడంతో పాటు విద్యార్థులకు అవసరమయ్యే పుస్తకాలు అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. కార్యక్రమంలో గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు,సర్పంచ్ దిమ్మల అప్పారావు, మార్కెట్‌కమిటీ చైర్‌పర్సన్ పిల్లి కనకలక్ష్మి అప్పారావు,ఎంపీటీసీ సూరిశెట్టి రాము, మందిర కార్యదర్శి వెలగా శ్రీనివాసరావు, సంఘ సభ్యులు దాడి శ్రీరామమూర్తి,కుంది సూర్యనారాయణ,నెమ్మా,బూడిద రామారావు, లక్ష్మణరావు, పెద్దలు సూరిశెట్టి కన్నారావు,ఆడారి కృష్ణ దాడి శివ తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహ విద్యార్థులకు రక్తపరీక్షలు



వసతిగృహ విద్యార్థులకు రక్తపరీక్షలు చేయిస్తున్న దాడి రత్నాకర్

అనకాపల్లిటౌన్: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ప్రతి విద్యార్థి ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వ పాఠశాలల్లో, ప్రభుత్వ హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులకు పౌష్టికాహారంలో భాగంగా వారానికి మూడు రోజులు చికెన్, ప్రతి రోజు గుడ్డు అందిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ అన్నారు. తన జన్మదిన వేడుకల్లో భాగంగా స్థానిక గాంధీనగరం బీసీ వసతి గృహం విద్యార్థులకు అబ్దుల్ కలాం సేవా సంస్థ వ్యవస్థాపక చైర్మన్ ఆళ్ల ప్రవీణ్‌కుమార్, హరిశెట్టి క్లినికల్ ల్యాబ్ కుమారస్వామి సహకారంతో ఆదివారం ఉచిత రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవనం చాలా పురాతనమైనదని, చాలా భాగం శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. విద్యార్థులు భయభ్రాంతులకు లోను కాకుండా తన సొంత నిధులతో తక్షణమే తాత్కాలి మరమ్మతులు చేసి, ఉన్నతాధికారులతో చర్చించి నూతన వసతిగృహానికి నిధులు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. రెండు వసతి గదులను తానే సొంత నిధులతో కట్టిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడు పథకం కింద అన్ని రకాల సౌకర్యాలను కల్పించడంతోపాటు జగనన్న విద్యా కానుకలో విద్యార్థులకు స్కూల్ యూనిఫారం, పుస్తకాలు, బ్యాగు, బూట్లు తదితర సామగ్రి అందించినట్టు తెలిపారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అభిలషించారు. ఉన్నత విద్యకయ్యే ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి అమ్ములు శ్రీను, కార్యదర్శి కొణతాల రాజు, ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ బొట్టా చిన్నియాదవ్, సభ్యులు దినేష్, చిరంజీవి, సతీష్, బీసీ వెల్ఫేర్ అధికారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



వైద్య సేవలందిస్తున్న సిబ్బంది

ముంచంగిపుట్టు: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సర్పంచ్ బోరగం భాగ్యవతి అన్నారు. మండలంలోని జర్రెల పంచాయతీ కేంద్రంలో ఆదివారం సర్పంచ్ భాగ్యవతి ఆధ్వర్యంలో సెయింట్ ఆన్స్ ఆస్పత్రి ద్వారా ఉచిత మెగా మెడికల్ క్యాంప్‌ను నిర్వహించారు. వివిధ రకాల ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న 130 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ భాగ్యవతి మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వైద్య సిబ్బంది సూచనలు పాటించాలన్నారు. నాటు వైద్యం జోలికి పోవద్దన్నారు.ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుతున్న సంపూర్ణ సేవలు పొందాలన్నారు. వైద్యాధికారి భార్గవి, స్టాఫ్ నర్సులు అర్చన, పావని, గీతా, నాయకులు సురేష్, సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



అరుణకుమారిని పరామర్శించిన అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అరకులోయరూరల్: విశాఖ కేజీహెచ్‌సీలోని వైద్యం పొందుతున్న మాజీ ఎంపీపీ అరుణకుమారిని, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆదివారం పరామర్శించారు. ఆమె గత కొద్దిరోజులు క్రితం అనారోగ్యంతో బాధపడుతూ విశాఖ కేజీహెచ్‌లో చేరారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, నాయకులతో కలిసి వెళ్లి, ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శెట్టి గంగాధరస్వామి, పెదబయలు జెడ్పీటీసీ సభ్యుడు బొంజుబాబు, మాజీ ఎంపీపీ ఉమామహేశ్వరరావు, నాయకుడు జర్సింగి సూర్యనారాయణ తదితరులున్నారు.

ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం



వసతి గృహ ఆవరణలో మొక్కలు నాటుతున్న ఏబీవీపీ విభాగ నాయకులు, విద్యార్థులు

జి.మాడుగుల: ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలుర వసతి గృహ ఆవరణలో నాయకులు, విద్యార్థులు ఆదివారం మొక్కలు నాటారు. ఏబీవీపీ విద్యార్థి విభాగ రాష్ట్ర కన్వీనర్ ఆనంద్ మాట్లాడుతూ స్వామి వివేకానంద స్ఫూర్తితో విద్యార్థులు ముందుకు సాగాలని కోరారు. విద్యా రంగ సమస్యలపై ఏబీవీపీ నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. నాయకులు నాగర్జున, సంతోష్, రవి, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం



రైతులకు వైఎస్సార్ బీమా చెక్కును అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మి

రంపచోడవరం: మండలంలో వేములకొండ రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు వైఎస్సార్ బీమా చెక్కులను జెడ్పీటీసీ సభ్యురాలు పండా వెంకటలక్ష్మి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.అన్నదాత కోసం అనేక సంక్షేమ పథకాలను అమలుచేస్తోందన్నారు. గిరిజన రైతులకు రాయితీపై విత్తనాలు, వ్యవసాయ పరికరాలు అందజేస్తోందన్నారు. వైస్ ఎంపీపీ కొమ్మిశెట్టి బాలకృష్ణ మాట్లాడుతూ గతంలో విత్తనాలు, ఎరువుల కోసం రైతులు ఎంతో శ్రమపడాల్సిన పరిస్థితి ఉండేదాన్నారు. ఆ సమయానికి అధికారులు అందుబాటులో లేక రైతులు పడిగాపులు పడిన సందర్భాలున్నాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్‌బీకేలను ఏర్పాటుచేసి, ఆయా కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు, యంత్ర పరికరాలు అందేలా చర్యలు తీసుకున్నారన్నారు. ప్రస్తుతం రైతుల చెంతకే ప్రభుత్వ సేవలందుతున్నాయన్నారు. పంట బీమాను ప్రభుత్వమే చెల్లిస్తోందన్నారు. పంటలకు సంబంధించిన పరిహారాన్ని రైతులకు అందేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. ఏవో లక్ష్మణరావు మాట్లాడుతూ మండలంలోని 420 మందికి వైఎస్సార్ బీమా మంజూరైనట్టు తెలిపారు. మండల సచివాలయ కన్వీనర్ పండా రామకృష్ణదొర, ఎంపీటీసీ సభ్యుడు నర్రి పాపారావు, గెద్దాడ సర్పంచ్ వడగల ప్రసాద్‌బాబు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా లలితాంబ పండగ



లలితాంబ అమ్మవారు

రాంబిల్లి: దిమిలి గ్రామంలో ఆదివారం లలితాంబ అమ్మవారి పండగను ఘనంగా నిర్వహించారు. దిమిలి పరిసర గ్రామాల భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం అన్న సమారాధన జరిపారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

వెతలు తీరేదెన్నడో!

- వాగులపై వంతెనలు లేక అవస్థలు
- వానొస్తే నిలిచిపోతున్న రాకపోకలు



జల్లివారిగూడెం వాగుపై ప్రవహిస్తున్న నీరు

చింతూరు: వర్షాకాలం వచ్చిందంటే చింతూరు మండలంలోని 11 గ్రామాల ప్రజలకు దశాబ్దాలుగా ఇబ్బందులు తప్పడంలేదు. చిన్నపాటి వర్షానికే ఆ గ్రామాలకు రాకపోకలు నిలిచి పోతున్నాయి. దీంతో పాటు చింతూరు, వీఆర్ పురం మండలాల నడుమ కూడా రోజుల తరబడి రాకపోకలు కొనసాగక పోవడంతో ఆయా ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆయా ప్రాంతాల్లోని సోకిలేరువాగు, జల్లివారిగూడెం వాగు, అన్నవరం వాగులు వర్షాకాలంలో ఉధృతంగా ప్రవహిస్తుంటాయి. వంతెనలు లేక వరద ఉధృతి తగ్గే వరకు ఆయా గ్రామస్తులు పడుతున్న కష్టాలు వర్ణనాతీతం. ఎగువ ప్రాంతాల్లో కురిసే వర్షాలకు సోకిలేరు వాగు లోలెవల్ వంతెన పై నుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. గోదావరి, శబరి నదుల నీటి మట్టాలు పెరిగితే వాగు సమీంలోని లోతట్టు ప్రాంతాలు ముంపున బారిన పడుతుంటాయి. ముకునూరు, నర్సింగపేట, తిమ్మిరిగూడెం, ఏజీకొడేరు, మల్లెతోట, ఉలుమూరు, రామన్నపాలెం, బొడ్రాయిగూడెం, చినసీతనపల్లి, పెద సీతనపల్లి, కొండపల్లి గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలో హైలెవల్ వంతెన నిర్మించడం ద్వారా వరదను కట్టడి చేసే అవకాశముంటుందని గ్రామస్తులు చెబుతున్నారు.

ఇసుకమేటతో ఇబ్బందులు

జల్లివారిగూడెం వాగు ఇసుక మేటలతో నిండిపోవడంతో చిన్నపాటి వర్షానికే వరదనీరు చప్టా పై నుంచి ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఇక్కడ ఇసుకమేటలు తొలగించడంతో పాటు లోలెవల్ వంతెన నిర్మించడం ద్వారా వరదనీరు ఉధృతి నిలువరించే అవకాశముంది.

అధికారుల దృష్టికి తీసుకెళ్తా



వాగులపై వంతెనలు లేకపోవడంతో వర్షాకాలం ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని త్వరలో జరిగే జిల్లా పరిషత్ సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లి వంతెనల నిర్మాణాలు చేపట్టేలా చర్యలు చేపడతాం.

–నవలం అమల, ఎంపీపీ, చింతూరు

వరదలు వస్తే అవస్థలు



వరదలు వస్తే పోటు కారణంగా వాగులు పొంగుతున్నాయి. వరదనీరు చప్టాల పైకి చేరి రోజుల తరబడి నిలిచిపోతుంది. దీంతో ప్రయాణాలు నిలిచిపోయి ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

–నవలం భీమయ్య, చూటూరు

విత్తన శుద్ధితో అధిక దిగుబడి



విత్తన శుద్ధిపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కోటవురట్ల/కశింకోట: విత్తన శుద్ధితో పంట దిగుబడి పెరుగుతుందని మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కూండ్రపు అరుణ అన్నారు. మండలంలోని సుందరయ్యపేట శివారు ఆనందపురం, లాలంకొత్తూరు, నూతలగుంటపాలెం గ్రామాల్లో ఖరీఫ్ వరి విత్తనాల శుద్ధి, బీజామృతం తయారీపై రైతులకు ఆదివారం అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. ఇందులో భాగంగా రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు అవసరమైన సేవల్ని గ్రామ స్థాయిలోనే అందించేందుకు చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. విత్తనశుద్ధి చేసి నీడలో ఆరబెట్టి తర్వాత విత్తుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం ఇన్‌చార్జి డి.రమణ, సిబ్బంది దేవి తదితరులు పాల్గొన్నారు.

మాకవరపాలెం: విత్తన శుద్ధితో తెగుళ్ల దూరం చేయొచ్చని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులకు అవగాహన కల్పించారు. ఆదివారం నారాయణరాజుపేటలో వరిసాగు చేసే రైతులకు ప్రకృతి సాగు పద్ధతులను వివరించారు. ఈ సందర్భంగా ఆవు మూత్రం, పేడ, సున్నం, పుట్టమన్నుతో తయారు చేసిన బీజామృతంతో విత్తన శుద్ధి చేయించారు. రైతులకు ఈ జీవామృతం తయారు చేయడంపై శిక్షణ ఇచ్చారు. బీజామృతంతో విత్తన శుద్ధి చేయడం వల్ల తెగుళ్లు, పురుగులను దరిచేరకుండా ఉండమేగాక విత్తనం మొలక శాతం బాగుంటుందని తెలియజేశారు. కార్యక్రమంలో ప్రకృతి సేద్యం సిబ్బంది కవిత, మంగ, అప్పారావు, సుదర్శన్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన

రోలుగుంట: జాతీయ ప్రకృతి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం శరభవరంలో రైతులకు విత్తన శుద్ధిపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం వరినారు పోసే సమయంలో విత్తనాలను ప్రకృతి పద్ధతిలో ఎలా శుద్ధి చేయాలో ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ శాఖ స్థానిక ఇన్‌చార్జులు దేవి, సాంబశివరావు మాట్లాడుతూ వరి విత్తనాలను శుద్ధి చేయడం వల్ల 21 రోజుల పాటు తెగుళ్లను నియంత్రిస్తుందని, మొలకశాతం మెరుగ్గా ఉంటుందని వివరించారు వరినారు మడులలో సస్యరక్షణ చర్యలు గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.